



అల్లిపురం కుమ్మరివీధిలో వినాయక విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతున్న కళాకారులు

పర్యావరణహితం.. భక్తిపారవశ్యం



- రూపుదిద్దుకుంటున్న గణనాథులు
- జగదాంబ, దొండపర్తి కుమ్మరివీధుల్లో జోరుగా గణేశ్ విగ్రహాల తయారీ
- వినాయక చవితికి మొదలైన సందడి

అల్లిపురం: వినాయక చవితి ఉత్సవాలకు గణనాథుల విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. ఈ నెల 27న వినాయకచవితి పర్వదినం సందర్భంగా నియోజకవర్గంలో దాదాపు వీధివీధినా గణపతి నవరాత్రుల పేరిట ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో తయారీదారులు వినాయక విగ్రహాలు తయారు చేస్తున్నారు. నియోజకవర్గంలో అల్లిపురం కుమ్మరి వీధి, దొండపర్తి, జగదాంబ దరి కుమ్మరివీధిలో విగ్రహాల తయారీలో కళాకారులు శ్రమిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసి విక్రయిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఆయా ప్రాంతాల్లో గణపతి, దేవీ నవరాత్రుల సందర్భంగా ఆయా దేవతామూర్తుల విగ్రహాలు తయారు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. వినాయక చవితిని పురస్కరించుకుని సుమారు రెండు నెలల నుంచే విగ్రహాల తయారీలో నిమగ్నమయ్యారు. 2 అడుగుల నుంచి 9 అడుగుల వరకూ భారీ విగ్రహాలు సిద్ధం చేస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ)తో పాటు కొందరు భక్తుల కోరిక మేరకు మట్టితో గణపతి విగ్రహాలు తయారు చేస్తున్నారు. అల్లిపురం కుమ్మరి వీధిలో కుటీర పరిశ్రమగా ప్రతి మహిళా చెరువు మట్టితో విగ్రహాలు తయారు చేయడంలో గత రెండు నెలలుగా బిజీగా ఉన్నారు. గత కొన్నేళ్లుగా కొంత మంది తయారీదారులు ప్రత్యేకంగా మట్టి విగ్రహాలు ఎక్కువగా తయారు చేస్తున్నారు. కోల్‌కతా నుంచి కూడా గంగానది మట్టితో తయారు చేసిన విగ్రహాలను స్థానిక వ్యాపారులు దిగుమతి చేస్తున్నారు. ఒక్కో కేంద్రంలో చిన్న విగ్రహాల నుంచి భారీ విగ్రహాల వరకూ సుమారు 5 వేలు సిద్ధం చేస్తున్నారు. ఒక్కో విగ్రహం రూ.100 నుంచి రూ.15 వేల వరకూ అమ్మకాలు సాగిస్తున్నారు.

రసాయనాలతో ప్రమాదం..

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ)తో తయారు చేసే విగ్రహాల ద్వారా పర్యావరణానికి తీరని ముప్పు అని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. విగ్రహాల అలంకరణకు ఉపయోగించే రసాయనాలు కలిసిన రంగులు మరింత ప్రమాదకరం. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆ విగ్రహాలను నిమజ్జనం చేసిన తర్వాత నీటిని కలుషితం చేయడమే కాకుండా అనేక రకాల రోగాలకు మూలం అవుతున్నాయని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పీవోపీ, కెమికల్స్‌తో జాగ్రత్త..

పీవోపీ, కెమికల్స్‌తో తయారు చేసే విగ్రహాలను ప్రతిష్ఠించడం వల్ల పర్యావరణాన్ని కలుషితం చేసినట్లవుతుంది. ప్రకృతికి ఎటువంటి అవరోధం కలగకుండా, అనుకూలమైన విధానంలో ఎకో ఫ్రెండ్లీ ప్రతిమలను మనమే తయారు చేసుకోవాలి. అవి అందంగా ఉండాలంటే మనం ఇంట్లో ఉపయోగించే సహజసిద్ధమైన పసుపు, కుంకుమ వంటి వాటితో అలంకరించుకుని పూజించాలి.

– ఆర్‌వీవీఎస్ నాగభూషణం, ప్రధానోపాధ్యాయులు, ఎంజీఎం హై స్కూల్

అన్ని రకాల విగ్రహాలు తయారు చేస్తున్నాం..



మా తయారీ కేంద్రంలో మట్టి విగ్రహాలతో పాటు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు కూడా తయారు చేస్తున్నాం. ఉత్సవ కమిటీల కోరిక మేరకు భారీ విగ్రహాలు తప్పనిసరి పరిస్థితుల్లో తయారు చేయాల్సి వస్తుంది. విగ్రహం బరువు తక్కువగా ఉండటం, ఫినిషింగ్‌లో విగ్రహాలు అందంగా ఉండటంతో నిర్వాహకులు వాటికే మొగ్గు చూపుతున్నారు. అన్ని రకాల విగ్రహాల తయారు చేయకపోతే ఉపాధి దెబ్బతినే అవకాశం ఉన్నందున తప్పనిసరి పరిస్థితుల్లో చేయాల్సి వస్తుంది. లేని ఎడల ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు.

– శ్రీకాకుళపు మంగరాజు, కళాకారుడు, కుమ్మరివీధి

ఏడాదిలో ఒకసారి..



మాకు ఏడాదిలో ఒకసారి మాత్రమే పని ఉంటుంది. దసరాకు ఇంత ప్రాముఖ్యత ఉండదు. వినాయక చవితి సమయంలోనే రెండు నెలల పాటు చేతి నిండా పని ఉంటుంది. మాకు తెలిసిన విద్య ఇదొక్కటే. ఈ రెండు నెలలు ఇంటిల్లిపాదీ కష్టపడతాం. అయినప్పటికీ రాబడి అంతంత మాత్రమే. అప్పులు చేసి పెట్టుబడి పెడతాం. మాకు బ్యాంకులు కూడా రుణాలు ఇవ్వవు. దీంతో అప్పు చేయడం తప్పనిసరి అవుతుంది. ప్రభుత్వం సబ్సిడీపై రుణాలు ఇప్పిస్తే మాకు సహాయకారిగా ఉంటుంది.

– శ్రీకాకుళపు శ్రీనివాసరావు, కుమ్మరివీధి

ఎర్రిగెడ్డ సమస్య పరిష్కారానికి వినతి



జీవీఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలోని ఎర్రిగెడ్డ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌కి వినతిపత్రం అందించారు. ఎర్రిగెడ్డ పూడికలతో మూసుకుపోవడం వల్ల భారీ వర్షాలు కురిస్తే గెడ్డ పొంగి జ్ఞానాపురం ముంపునకు గురవుతుందన్నారు. ప్రత్యేక టెండర్ ద్వారా పూడికలు తొలగించాలని కోరారు. జీఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో రిక్వెస్ట్ బస్టాప్ ఏర్పాటు చేయాలన్నారు. జ్ఞానాపురంలో రైల్వేస్టేషన్, కళాశాలలు, దేవాలయాలు, చర్చిలు, హోల్‌సేల్ మార్కెట్ ఉండడం వల్ల రైల్వేస్టేషన్ కూడలి వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. జోన్–5కు ఆనుకుని ఉన్న బిషప్ మరియదాస్ కల్యాణ మండప నిర్మాణం విషయమై చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు.

ముగిసిన శ్రావణలక్ష్మి పూజలు



మహా పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేదపండితులు

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో నెల రోజుల పాటు నిర్వహించిన శ్రావణలక్ష్మి పూజలు శనివారం మహా పూర్ణాహుతితో ముగిసాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శోభారాణి, వేద పండితులు, అర్చకులు, పలువురు ఉభయదాతలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉత్తమ సేవలకు సత్కారం



సత్కారం పొందిన సిబ్బందితో సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ

అల్లిపురం: సిబ్బంది సంక్షేమంతో పాటు వారి ప్రతిభను గుర్తిస్తూ, ఉన్నతాధికారుల సమక్షంలో 122 మందికి పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి రివార్డులు అందజేశారు. కమిషనరేట్ సమావేశ మందిరంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన గత నెల ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి రివార్డులు అందజేశారు. రివార్డులు పొందిన సిబ్బంది కమిషనర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ఎట్టకేలకు కల్వర్ట్‌పై గ్రిల్స్ ఏర్పాటు



కల్వర్ట్‌పై గ్రిల్స్ వేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

జగదాంబ: జీవీఎంసీ 39వ వార్డు రామకృష్ణా రైతు మార్కెట్ కల్వర్ట్‌పై ఐరన్ గ్రిల్స్ విరిగిపోయి ప్రమాదకరంగా మారింది. ఇందులో పడితే కెనాల్ లోపలికి వెళ్లిపోయే పరిస్థితి ఉండడంతో వ్యాపారులు గ్రిల్స్ మధ్య చెక్క పెట్టెలు ప్రమాద సూచికగా ఏర్పాటు చేసుకున్నారు. శనివారం అధికారులు ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేయడంతో వ్యాపారులు, పాదచారులు ఊపిరి పీల్చుకున్నారు. ఇదే తరహాలో వెలంపేట కల్వర్ట్‌పై కూడా గ్రిల్స్ వేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

పోలీసులకు దిశా నిర్దేశం



మాట్లాడుతున్న సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ

అల్లిపురం: పోలీసు అధికారులు, సిబ్బంది పూర్తి పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు, అధికార దుర్వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. శనివారం పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో జరిగిన ఆగస్ట్ నెల రివ్యూ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా పండగ జరిగేలా అన్ని పోలీసు స్టేషన్ అధికారులకు సీపీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేస్తున్న తీరు, అధికారులు ఫిర్యాదుదారులతో ప్రవర్తిస్తున్న తీరుపై ఆరా తీశారు. ఈ సమావేశంలో డీసీపీ–1 అజితా వేజెండ్ల, డీసీపీ–2 డి.మేరీ ప్రశాంతి, డీసీపీ (అడ్మిన్) కృష్ణ కాంత్ పటేల్, ఏడీసీపీలు, ఏసీపీలు, స్టేషన్ ఎస్‌హెచ్‌వోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న రాంప్రసాద్ కుటుంబ సభ్యులు

దాబాగార్డెన్స్: రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ ప్రెసిడెంట్, ప్రముఖ సంఘ సేవకుడు కంచర్ల రాంప్రసాద్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పాతనగరంలోని స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గోమాతకు పూజలు చేశారు. కార్యక్రమంలో రాంప్రసాద్, సతీమణి కంచర్ల అన్నపూర్ణ, కుమార్తె సందితమ్మ పాల్గొన్నారు.

యూజీడీకి మరమ్మతులు



దగ్గరుండి యూజీడీకి మరమ్మతులు చేయిస్తున్న పచ్చిరిపల్లి రాము

అల్లిపురం: రెండు రోజులుగా వివేకానంద కాలనీ విద్యోదయ స్కూల్‌కు వెళ్లే దారిలో యూజీడీ పొంగిపొర్లటంతో విద్యార్థులు, పాదచారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రెండు రోజులైనా ఎవరూ పట్టించుకోకపోవటంతో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు పచ్చిరిపల్లి రాము సంబంధిత ఏఈ, సిబ్బందికి సమాచారం అందజేశారు. దీంతో వారు తక్షణమే అక్కడికి చేరుకుని యూజీడీకి మరమ్మతులు చేశారు. దీంతో స్థానికులు పచ్చిరిపల్లి రాముకు కృతజ్ఞతలు తెలిపారు.

బల్లిగిరి వెంకన్నకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామి అమ్మవార్లు



స్వామి సన్నిధిలో వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు

అల్లిపురం: బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు ఆధ్వర్యంలో తెల్లవారు జామున తిరువీధి ఉత్సవం, బేడా చుట్టూ పల్లకీ ఊరేగింపు చేపట్టారు. ఏడు శనివారాల పూజలు నిర్వహించే వారు అధిక సంఖ్యలో పాల్గొని ప్రదక్షిణలు చేశారు. అనంతరం ధ్వజస్తంభం వద్ద ఏడు పిండి దీపాలతో పూజలు చేశారు. స్వామి వారిని దర్శించుకుని పూజలు జరిపారు. ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

స్వామివారి సన్నిధిలో వాసుపల్లి..

బల్లిగిరి వేంకటేశ్వర స్వామిని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు స్వామి వారికి విశేష పూజలు చేశారు. ఎమ్మెల్యే వెంట ఎర్నిమాంబ అమ్మవారి దేవస్థానం చైర్మన్ లండా రమణ, టర్నల్ చౌల్ట్రీ మాజీ చైర్మన్ లింగం శ్రీనివాసరావు, 33వ వార్డు అధ్యక్షుడు ముత్తాబత్తుల రమేష్, వచ్చిరిపల్లి రాము, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు సనపల రవీంద్ర భరత్, సూర్యనాయుడు, బూర్ల చిన్న, వెంకటేశ్వర మెట్ట దేవస్థానం మాజీ చైర్మన్ ఆడారి వెంకట మహేష్, సౌత్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆకుల శ్యామ్, ఆదివిష్ణు, బోరా విజయలక్ష్మి, కృష్ణవేణి, చోడుపల్లి శివకుమార్, రామరాజు, బోని దేవా తదితరులు ఉన్నారు.

సురవరం సుధాకర్‌రెడ్డికి ఘన నివాళి

అల్లిపురం: సీపీఐ పూర్వ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి మృతి పట్ల పార్టీ విశాఖ జిల్లా సమితి సంతాపం వ్యక్తం చేసింది. ఈ మేరకు అల్లిపురం సీపీఐ కార్యాలయంలో శనివారం జరిగిన సంతాప సభలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు ఎం. పైడిరాజు, జిల్లా కార్యదర్శి ఎస్.కె. రెహమాన్, సహాయ కార్యదర్శులు కె.సత్యనారాయణ, పి. చంద్రశేఖర్, కె. సత్యాంజనేయ, ఆర్. శ్రీనివాసరావు, ఎన్.నాగభూషణరావు, సీఎన్ క్షేత్రపాల్, కె. వనజాక్షి తదితరులు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

అభాగ్యుల సేవలో సీపీ సతీమణి

అల్లిపురం: భర్త అడుగుజాడల్లోనే నడుస్తూ అనాథల పట్ల అంకితభావం చూపిస్తున్నారు పోలీస్ కమిషనర్ భార్య సువశ్రీ బాగ్చి. శనివారం తాను ప్రయాణిస్తున్న హార్బర్ రోడ్డులో ఒక మానసిక దివ్యాంగురాలు కనిపించడంతో ఆమె ఆగి బాధితురాలికి ఆహారం అందజేశారు. హార్బర్ పోలీస్ స్టేషన్ సీఐ సింహాద్రి నాయుడి సహకారంతో ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసుతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి అభాగ్యురాలికి ఆశ్రయం కల్పించమని కోరారు. ఆమెకు వైద్యం అందించి కుటుంబ సభ్యులకు అప్పగించాలని తెలిపారు. ఏఎస్‌ఐ మూర్తిని ఎస్కార్ట్ ఇచ్చి ఆ మహిళను జీవీఎంసీ టీపీఎస్‌ఆర్ మహిళా షెల్టర్ హోంకు పంపించారు. అభాగ్యురాలికి షెల్టర్ హోంలో ఆశ్రయం కల్పించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు.



మానసిక దివ్యాంగురాలికి ఆహారం అందజేస్తున్న సువశ్రీ బాగ్చీ, సీఐ సింహాద్రి నాయుడు

ఇంద్రజాలికుడు బీఎస్ రెడ్డికి సత్కారం

దాబాగార్డెన్స్: ఆస్కార్ ఆఫ్ మెజీషియన్‌గా పేరొంది, మెర్లిన్ అవార్డు పొందిన ఇంద్ర జాలికుడు బీఎస్ రెడ్డి విశాఖ వాసి కావడం సంతోషంగా ఉందని సెంచూరియన్ విశ్వ విద్యాలయం చాన్సలర్ ఆచార్య జీఎస్‌ఎన్ రాజు ప్రశంసించారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శనివారం జి.త్యాగరాజన్ నిర్వహణలో విశాఖ పాటల ప్రేమికుల మిత్రుల ఆధ్వర్యంలో నిర్వహించిన బీఎస్ రెడ్డి సన్మాన సభలో ఆచార్య జీఎస్‌ఎన్ రాజు పాల్గొని మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా 57 వేల మంది మెజీషియన్లు సభ్యులుగా ఉన్న అతి పెద్ద సంస్థలో బీఎస్ రెడ్డికి అరుదైన గౌరవం దక్కడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త డాక్టర్ డి.జైభరత్, ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ కార్యదర్శి చెన్నా తిరుమలరావు, నిర్వాహకుడు జి.త్యాగరాజన్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ముందుగా నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. అంబిక, ఉమా భూషణ్, జ్యోతి, మాధవీలత, బాలాజీ వర్మ, హర్షిణి, దేవరాజ్, అరుణ, బ్రహ్మాజీ, శశిభూషణ్ పలు సినీ గీతాలు ఆలపించి శ్రోతల ప్రశంసలు పొందారు. రూపవాణి వ్యాఖ్యానం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



ఇంద్రజాలికుడు బీఎస్ రెడ్డిని సత్కరిస్తున్న ఆచార్య జీఎస్‌ఎన్ రాజు తదితరులు

లయన్స్ క్లబ్ వైద్య శిబిరానికి చక్కని స్పందన

అల్లిపురం: లయన్స్ ఇంటర్నేషనల్, లయన్స్ క్లబ్ ద్వారకానగర్, బంగారుమెట్ట శ్రీ రామ ఆంధ్ర యువజన సమాజం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం బంగారుమెట్టలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి చక్కటి స్పందన లభించింది. ఈ సందర్భంగా సుమారు వంద మందికి ఉచిత కంటి, బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో సమాజం అధ్యక్షుడు, క్యాంపు కో ఆర్డినేటర్ భీశెట్టి హనుమంతరావు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పీఎస్‌వీ గణేష్, కార్యదర్శి కె. తేజేశ్వరరావు, కోశాధికారి వై.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా ఎకనా ప్రెన్యూర్స్ ఫెస్ట్–2025



విజేతకు బహుమతి అందజేస్తున్న ముఖ్య అతిథి సరిత, అధ్యాపకులు

కంచరపాలెం: ప్రపంచ వ్యాపారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్స్, ఎంట్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో ఎకనా ప్రెన్యూర్స్ ఫెస్ట్–2025ను శనివారం వేడుకగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ వ్యాపారవేత్త సరిత పాల్గొని మాట్లాడారు. పలు సాంస్కృతిక పోటీలు, ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, డాక్టర్ మంగవేణి, రమణీలత, వసంత, గాయిత్రి, మౌసమి, పావని, యోజన, డాక్టర్ పి.కె.జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

త్యాగధనుడు టంగుటూరి



టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ

అల్లిపురం: టంగుటూరి ప్రకాశం పంతులుకు పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పుష్పమాల వేసి అంజలి ఘటించారు. దేశ స్వాతంత్య్రం కోసం సమస్తం త్యాగం చేసిన త్యాగధనుడు అని కొనియాడారు. ఉమ్మడి ఆంధ్ర తొలి ముఖ్యమంత్రిగా ఆ రోజుల్లోనే 14 నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణాన్ని ప్రారంభించిన రైతు బాంధవుడు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నతాధికారులు, కమిషనరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో..

మహారాణిపేట: కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, అధికారులు టంగుటూరికి ఘన నివాళులర్పించారు. ఆయన సమాజానికి అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలు విభాగాల పర్యవేక్షకులు బీవీ రాణి, శ్యామ్, డీటీలు బెహర రవిశంకర్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర



డీపీఆర్‌వో కార్యాలయ పరిసరాలు శుభ్రం చేస్తున్న అధికారులు, సిబ్బంది



సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్ వాణి

మహారాణిపేట: జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ, సెట్విస్ కార్యాలయాల్లో శనివారం స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఉప సంచాలకులు కె. సదారావు, సహాయ సంచాలకులు డి. రమేష్, సెట్విస్ సీఈవో సత్యనారాయణ సారథ్యంలో అధికారులు, సిబ్బంది పరిశుభ్రతా చర్యలు చేపట్టారు. ఆగస్టు నెల థీమ్ వర్షాకాలం పరిశుభ్రతకు అనుగుణంగా కార్యాలయ ఆవరణలోని పిచ్చి మొక్కలను తొలగించి బ్లీచింగ్ చల్లారు. అనంతరం సమాచార శాఖ ఉప సంచాలకులు, ఎస్‌ఐసీ ఏడీ కార్యాలయం, సెట్విస్ కార్యాలయ అధికారులు, సిబ్బంది అంతా స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. సమాచార పౌర సంబంధాల శాఖ డీడీ కె. సదారావు, ఏడీ డి. రమేష్, సెట్విస్ సీఈవో పీవీఎన్ సత్యనారాయణ, సూపరింటెండెంట్ ఎస్.ఎస్. సుధాకర్, డివిజనల్ పీఆర్‌వో నారాయణరావు, ఏపీఆర్వో శ్రీనివాసరావు, ఏవీఎస్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో..

కేజీహెచ్‌లో వైద్యులు, నర్సులు, నర్సింగ్ విద్యార్థులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె నీటిని ఎక్కువ రోజులు నిల్వ చేయడం వల్ల జరిగే నష్టాల గురించి తెలిపారు. కేజీహెచ్‌లో పలు ప్రాంతాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటర్ బి.వి. రమణ, సీఎస్ ఆర్‌ఎంవో డాక్టర్ యు. శ్రీహరి, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ బి. కిరణ్‌కుమార్, స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర నోడల్ అధికారి డాక్టర్ ఎ.రాజేష్, ఆర్‌ఎంవో బంగారయ్య, నర్సింగ్ సూపరింటెండెంట్లు సీహెచ్ పద్మావతి. మినిస్టీరియల్, మలేరియా సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

- జిల్లా పరిషత్‌లో జరిగిన కార్యక్రమంలో సీఈవో పి.నారాయణమూర్తి ఆధ్వర్యంలో పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాధాష్టమికి పూల అలంకరణ పోటీలు

దాబాగార్డెన్స్: రాధాష్టమిని పురస్కరించుకుని పూల అలంకరణ పోటీలు నిర్వహించనున్నట్టు హరే కృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి యదురాజ దాస తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. శ్రీకృష్ణాష్టమి తర్వాత పదిహేను రోజులకు వచ్చే భాద్రపద శుద్ధ అష్టమిని రాధాష్టమి పర్వదినంగా జరుపుకుంటారని తెలిపారు. ఈ నెల 31న రాధాష్టమి సందర్భంగా రెండు విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు. 12 నుంచి 16 ఏళ్లలోపు బాల బాలికలకు, 16 ఏళ్ల పైబడిన మహిళలకు ఈ పోటీలు ఉంటాయన్నారు. ఆనందపురం మండలం, గంభీరం ఐఐఎం రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠంలో నిర్వహిస్తామని, పాల్గొనేవారు రాధాష్టమి థీమ్‌కు సంబంధించి పూలదండలు, పుష్పగుచ్ఛాలు మాత్రమే తయారు చేయాలన్నారు. పూలు, ఇతర పూల సామగ్రిని పోటీదారులు తమ సొంతంగా సమకూర్చుకోవాలని సూచించారు. సృజనాత్మకత, పరిశుభ్రత, ప్రధాన అంశం అనుసరణ, సహజ పూల వినియోగం, అలంకరణకు న్యాయనిర్ణేతలు ప్రాముఖ్యమిస్తారన్నారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.50 వేలు, రెండో బహుమతిగా రూ.40 వేలు, మూడో బహుమతిగా రూ.25వేలు అందజేస్తామని వెల్లడించారు. విశాఖ మహా నగరంలో తొలిసారిగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, మరిన్ని వివరాలకు 77990 06648 నంబర్‌లో సంప్రదించవచ్చని యదురాజ దాస తెలిపారు.

ఉపాధి అవకాశాలపై వర్క్‌షాప్

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్ (జేకేసీ), కెరీర్ గైడెన్స్ సెల్ సంయుక్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉపాధి అవకాశాలపై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ అధికారి, చీఫ్ రిసోర్స్ పర్సన్ డి.అరుణ పాల్గొని ప్రస్తుత సమాజంలో విద్యార్థులు కేవలం డిగ్రీతో ఆగిపోకుండా, భవిష్యత్ కోసం సరైన ఉపాధి అవకాశాలు, పోటీ పరీక్షలు, ప్రైవేట్ రంగం అవసరాల వంటి విషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జేకేసీ కోఆర్డినేటర్ ఎం.విద్యాకల్పన, డాక్టర్ టీఎంఎ నివేద, జె.సునీత, జేకేసీ మెంటార్ వీఎన్ రాజు, డి.ప్రజ్ఞ పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాబు మోసాలపై ఇంటింటి ప్రచారం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 29వ వార్డు అధ్యక్షుడు పీతల వాసు నేతృత్వంలో శనివారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలు వివరించారు. వార్డు పరిధి పోలింగ్ బూత్ 187లో గ్రాండ్ బే హోటల్ ఏరియా, సూర్యానగర్, గోకుల్ రోడ్డు, సెంచరీ క్లబ్ ఏరియాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కనకల ఈశ్వర్, బెవర మహేష్, బొండాడ వెంకట్రావు, అడపా శివ, ఆరుగుల రాజ్‌కుమార్, చంద్రమౌళి, కోట ఆనంద్, కోండ్రి సతీష్, తమ్మినేని శ్రీను, లంకె మహేశ్వరి, ప్రసాద్, జి.శివ, సతీష్, ఉమ, పప్పు కమల, గండివలస పెంటయ్య, మధు, పీతల చరణ్, సారిపల్లి రమణ తదితరులు పాల్గొన్నారు.

35వ వార్డులో..

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డులో జరిగిన కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు కనకరెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. 89వ నంబర్ బూత్ పరిధి వెలంపేటలో కార్యకర్తలతో కలిసి చంద్రబాబు ఇచ్చిన మోసపూరిత హామీల గురించి ప్రజలకు తెలిపారు. ఈ క్యాక్రమంలో పార్టీ జిల్లా సెక్రటరీ ఆదివిష్ణురెడ్డి, సౌత్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సువార్తరాజు, పబ్లిక్ వింగ్ ప్రెసిడెంట్ జీరు సూర్యనారాయణరెడ్డి, నాగిరెడ్డి, నగేష్, గణేష్, దుర్గాప్రసాద్, పి.రమణమ్మ, వై.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



వెలంపేటలో ప్రచారం చేస్తున్న 35వ వార్డు అధ్యక్షుడు కనకరెడ్డి తదితరులు



29వ వార్డులో బాబు మోసాలు వివరిస్తున్న పీతల వాసు తదితరులు